క్లుప్తంగా

పాఠశాలకు అవార్డు రావడం అభినందనీయం



అవార్డు అందుకుంటున్న చందలూరు హెచ్‌ఎం, పీడీ

జే.పంగులూరు: జిల్లా క్రీడా ప్రతిభా అవార్డు చందలూరు పాఠశాలకు రావడం సంతోషంగా ఉందని ఉపాధ్యాయులు పేర్కొన్నారు. జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా పాఠశాలకు అవార్డు రావడంతో శుక్రవారం అభినందన సభ నిర్వహించారు. బాపట్లలోని గురుకుల పాఠశాలలో డీఈఓ, డీ ఎస్ఈఓ, డీఎస్డీ ఎస్డీఎఫ్ చేతుల మీదుగా హెచ్ఎం గిరిజ, పీడీ ప్రతిప మెమొంటో, సర్టిఫికెట్ అందుకున్నారు. ఈసందర్భంగా విద్యాకమిటీ చైర్మన్ గొట్టిపాటి హరికృష్ణ , గ్రామ పెద్దలు అభినందించారు.

సెప్టెంబర్ 3న మహిళా డిగ్రీ కాలేజీలో జాబ్ మేళా

చీరాల అర్బన్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, సీడాప్ సంయుక్త ఆధ్వర్యంలో సెప్టెంబర్ 3న చీరాలలోని వైపీ ప్రభుత్వ మహిళా డిగ్రీ కాలేజీలో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్య అభివృద్ధి అధికారి ఈ.తమ్మాజీరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేళాకు క్లిమ్ టెక్స్‌టైల్స్, గోదావరి కో-ఆపరేటివ్ సొసైటీ, టీవీఎస్ సుందరం, రాయల్ మెరైన్, రిలయన్స్ ట్రెండ్స్ కంపెనీలు హాజరవుతాయన్నారు. 120కి పైగా ఖాళీలు ఉన్నాయని, జీతం విద్యార్హతను బట్టి ఉంటుందన్నారు. టెన్త్, ఇంటర్, ఐటీఐ, డిగ్రీ, బీటెక్, డిప్లొమో, బీఎస్సీ కెమిస్ట్రీ, ఎమ్మెస్సీ కెమిస్ట్రీ, ఎంబీఏ, పీజీ విభాగాలు చదువుకున్న యువతీ యువకులు 18-35 సంవత్సరాల్లోపు నిరుద్యోగులు వివరాలతో నేరుగా హాజరుకావాలని ప్రకటనలో కోరారు.

వర్షంతో పంటలకు మేలు



జే.పంగులూరు: ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో పంటలకు ఎంతో మేలు జరుగుతుందని ఏవో సుబ్బారెడ్డి అన్నారు. మండల పరిధిలోని పలు గ్రామాల్లో శుక్రవారం పంటలను ఏఓ సుబ్బారెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖరీఫ్‌లో సాగు చేసిన పంటలు తీవ్ర వర్షభావ పరిస్థితుల వలన ఎండు ముఖం పట్టాయన్నారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షం పంటలకు జీవ పోసినట్లే అన్నారు. మండలంలో 11 మి.మీ వర్షం పడినట్లు తెలిపారు. ఇప్పటివరకు సాగు చేసిన మినుము ఇతర పంటలకు మేలు కలుగుతుందన్నారు.

హెచ్‌ఐవీ అంటువ్యాధి కాదు

చీరాల రూరల్: హెచ్‌ఐవీ వ్యాధి అంటువ్యాధి కాదని ఆ వ్యాధి గురించి ఎవరూ భయపడవద్దని వక్తలు సూచించారు. చీరాల మహిళా మండలి, టిఐ ప్రాజెక్టు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎయిడ్స్ కంట్రోల్ ప్రోగ్రాం సంయుక్త ఆధ్వర్యంలో మాజీ మంత్రి జాగర్లమూడి లక్ష్మి పద్మావతి సహకారంతో పర్చూరులోని అంగన్‌వాడీ కేంద్రంలో 'మీకు తెలుసా' అనే కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పలువురు ఆరోగ్య కార్యకర్తలు మాట్లాడారు. కార్యక్రమంలో షంషీద్, ఏ. శ్రీనివాసరెడ్డి, సంధ్య, జ్యోతి, దానమ్మ, శిరీషా, సియేస్ కుమారి, సంధ్య తదితరులు పాల్గొన్నారు.

ఎంప్లాయ్‌మెంట్ ఎక్స్ఛేంజ్‌లో పేర్ల నమోదు

చీరాల రూరల్: చదువుకోవడమే కాకుండా చదువుకు తగ్గ ఉద్యోగం సాధించాలంటే ప్రతి ఒక్క విద్యార్థి ఎంప్లాయ్‌మెంట్ ఎక్సేంజీలో పేర్లు నమోదుచేసుకోవాలని దత్తోపంత్ తేంగడి జాతీయ కార్మిక విద్యా, అభివృద్ధి సంస్థ విజయవాడ ప్రాంతీయ సంచాలకులు ఆర్. రవిశంకర్ అన్నారు. శుక్రవారం ఈపురుపాలెం లోని ఎస్‌కెఈఎస్ఎం ఐటీఐలో ప్రభుత్వ పథకాల అవగాహన, నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రవిశంకర్ పాల్గొని విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. నేషనల్ కెరీర్ సర్వీసెస్ పోర్టల్‌లో విద్యార్థులు తమ పేర్లను నమోదు చేసుకోవడం ద్వారా ఉపాధి లబ్ధి పొందవచ్చునని సూచించారు. నేషనల్ కెరీర్ సర్వీసెస్ అనేది భారత ప్రభుత్వం ఎంప్లాయ్‌మెంట్ ఎక్సైంజ్ అని తెలిపారు. కార్యక్రమంలో ఇంటిగ్రేటెడ్ పీపుల్స్ డెవలప్‌మెంట్ సొసైటీ అధ్యక్షుడు ఎస్‌డీ. మతిన్, కాలేజి ప్రిన్సిపాల్ ఎస్. సత్తార్, ఇన్‌చార్జ్ శేషయ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే ప్రాధాన్యత

చీరాల టౌన్: రెవెన్యూ ఉద్యోగులు, సిబ్బంది అలసత్వం వహించకుండా నిబద్ధతతో పని చేయాలని తహశీల్దార్ కుర్రా గోపీకృష్ణ సూచించారు. శుక్రవారం రెవెన్యూ కార్యాలయంలోని సమావేశపు హాలులో రెవెన్యూ ఉద్యోగులతో తహశీల్దార్ సమావేశాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ మండలంలోని రెవెన్యూ గ్రామాల వారీగా పెండింగ్‌లో ఉన్న అర్జీలను త్వరగా విచారణలు చేసి ప్రజల సమస్యలను పరిష్కరించాలన్నారు. ఉద్యోగులు ప్రజలతో సత్సంబంధాలు కలిగి జవాబుదారీగా పనిచేయాలన్నారు.

అంతా శుద్ధ అబద్ధం



అపరిశుభ్రంగా ఉన్న 20 లీటర్ల మినరల్ వాటర్ క్యాన్లు



వాహనాల్లో అమ్మకానికి తీసుకెళ్తున్న రూ.10 వాటర్ బాటిళ్ల కేసులు

- మినరల్ వాటర్ కాదు.. రోగాలను తెచ్చే వాటర్
- జోరుగా రూ.10 వాటర్ బాటిళ్ల అమ్మకాలు
- పుట్టగొడుగుల్లా అనుమతిలేని వాటర్ ప్లాంట్లు
- ప్రజల ప్రాణాలతో చెలగాటం
- అసలే సీజనల్ వ్యాధులతో జనం ఇక్కట్లు

చీరాల టౌన్: మనం తాగే నీరు శరీరంలో ప్రధాన పాత్ర పోషిస్తుంది. తాగే నీరు వలనే సగం ఆరోగ్యం ఆధారపడి ఉంటుంది. పొరపాటున తాగే నీరు కలుషితమైందో అంతే సంగతులు రోగాల బారిన పడినట్లే. ప్రస్తుత కాలంలో ఎక్కడ చూసినా చిన్న అంగట్లో నుంచి ఫంక్షన్ హాళ్లో వరకు. రోడ్డు మీద ఉన్న చిన్నపాటి టిఫిన్ సెంటర్ నుంచి రెస్టారెంట్ల వరకు మినరల్ వాటర్ హవానే నడుస్తోంది. అలా తాగడం ఇలా పారేయడం. కాని అందులో ఉన్న నీరు మంచివా లేదా పనికిరానివా అని ఆలోచన మాత్రం రావడం లేదు. ఫలితంగా ఆస్పత్రుల చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సి వస్తోంది. చీరాల నియోజకవర్గంలో మొత్తం 50 ప్లాంట్లకు పేనే ఉన్నాయి.

పేరులోనే మినరల్.. అంతా జనరల్

చిన్నగ్రామాల నుంచి పెద్ద పట్టణాల వరకు అందరూ తాగుతుంది మినరల్ వాటర్ పేరుతో నడుస్తున్న మామూలు నీరు. పేరులోనే మినరల్ తప్ప నీటిలో ఉండవు. పేదవాడి నుంచి మధ్య తరగతి ప్రజలు క్యాన్ వాటర్‌నే తాగుతున్నారు. ఇదే చాలా మంది అక్రమార్కులకు మాత్రం ఈ నీటి వ్యాపారం లాభసాటి వ్యాపారంగా మారింది. పెద్దగా పెట్టుబడి లేకుండా తక్కువ రోజుల్లోనే లక్షలు గడిస్తుడంటంతో చాలామంది మినరల్ వాటర్ ప్లాంట్లు వ్యాపారాన్ని నిర్వహిస్తున్నారు. కనీస ప్రమాణాలు పాటించక పోవడంతో పాటు ఐఎస్ఐ అనుమతి ఏ ఒక్కరికి లేదు. నిబంధనల ప్రకారం ఐఎస్ఐ అనుమతి ప్రతి యేటా లక్షకుపైగా ఖర్చవుతుంది. దీనికి తోడు ప్రతి నెలా ప్రభుత్వానికి చెందిన ల్యాబ్‌లు వాటర్ టెస్ట్ చేయించాల్సి ఉంటుంది. వాటర్‌ప్లాంటులో ఆర్ఓ మిషనరీతో పాటు కెమిస్ట్‌తో పాటు మైక్రోబయాలజీ ఉండి నీటిని టెస్ట్ ఓకే అయిన తరువాత నీటిని విక్రయించాల్సి ఉంటుంది. టెస్ట్ పరిశీలనే రెండు రోజులు పడుతుంది. కాని కొందరు అక్రమార్కులు రూపాయి ఖర్చుతో పది రూపాయలు సంపాదించాలని అత్యాశతో ఎటువంటి ఐఎస్ఐ అనుమతి లేకుండానే అక్రమవ్యాపారానికి తీరలేపారు.

రూ.10 వాటర్ బాటిళ్లతో మోసం..

చీరాల నియోజకవర్గంలోని మారుమూల ప్రాంతాల్లోని చిల్లరకొట్టు, బడ్డీబంకుల్లో సైతం రూ.10 వాటర్ పేరుతో దర్జాగా నీళ్ల వ్యాపారం చేస్తున్నారు. నియోజకవర్గంలో కేవలం రూ.10 వాటర్ బాటిళ్ల విక్రయాలు రోజుకు లక్షల్లోనే జరుగుతున్నాయి. కనీస నాణ్యతా ప్రమాణాలు లేకుండానే చీరాలలో మినరల్ వాటర్, పది వాటర్ బాటిళ్ల అమ్మకాలు చేస్తున్నారు. ప్రసుత్తం చీరాలలోని కొత్తపేటలో అధికంగా ఈ ప్లాంట్లు నడుస్తున్నాయి.

నేరుగా నీళ్లు పట్టి విక్రయిస్తున్నారు..

నియోజకవర్గంలో ఉన్న ఒకటి రెండు మినహా మిగిలిన వాటర్ ప్లాంట్లన్నీ ఎటువంటి ప్రాసెసింగ్ చేయకుండా నీటిని తయారు చేస్తున్నారు. మంచి నీటి బోర్లు వేసి వాటిని ఓవర్‌హెడ్ ట్యాంక్ ద్వారా నింపి అదే నీటిని క్యాన్‌లలో పట్టి విక్రయిస్తున్నారు. కంపెనీలు ఇచ్చి ఫ్రిజ్‌లలో నీటిని పోయడం వలన నీరు ఎలా ఉన్నా చల్లగా ఉండటంతో అర లీటరు రూపాయి చొప్పున ప్రజలు కొనుగోలు చేసి మరీ తాగుతున్నారు. చీరాల నుంచే కారంచేడు, పర్చూరు, ఇంకొల్లు, బాపట్ల ప్రాంతాలకు వాటర్ క్యాన్లు, రూ.10 వాటర్ బాటిళ్లు టాటా ఏస్, ఆటోలు, ఇతర వాహనాల్లో సరఫరా చేస్తున్నారు. చీరాలలో ఉన్న మినరల్ వాటర్ ప్లాంట్లు రోజుకు రెండువేల క్యానులు, వాటర బాటిళ్లు వేలాది కేసులను విక్రయిస్తున్నారు. ఏడాదికి చీరాల వాటర్ ప్లాంటు నీటిని అమ్మి కోట్లు సంపాదిస్తున్నారు. క్యాన్ నీటికి కేవలం రెండు రూపాయలు ఖర్చు అవుతుంది. వ్యాపారులు దీనిని రూ.15 ఎటువంటి శుభ్రం లేకుండానే ఒక్కో క్యానుకు వసూళ్లు చేస్తున్నారు. వాటర్ క్యాన్లు ఎక్కువ సేపు నిల్వ ఉంటే బ్యాక్టీరియా చేరుతుంది. లేకుంటే ఫంగస్ కూడా పడుతుంది. కాని ఇవేమి పట్టని వాటర్ ప్లాంట్లు ఎటువంటి శుద్ధిచేయకుండానే క్యానుల్లో బోరు నీటిని నింపుతున్నారు.

> **అనేక రోగాలు వస్తాయి..**
>
> ఎటువంటి టెస్ట్‌లు నిర్వహించకుండా మినరల్ వాటర్ పేరుతో విక్రయిస్తున్న నీళ్లు తాగితే హానికరం. చీరాల ప్రాంతంలో నీటిలో ఐరన్ శాతం అధికంగా ఉంటుంది. పీహెచ్ శాతం కూడా తక్కువగా ఉంటుంది. వీటి ద్వారా వైరల్ జబ్బులు సోకే అవకాశం ఎక్కువగా ఉంది. క్యాన్‌లలో వాటర్ నిల్వ ఉంటుంది కావునా బ్యాక్టీరియా చేరి పలు అనారోగ్య సమస్యలను తెచ్చే ప్రమాదం ఉంది. అవి చనిపోవాలంటే క్లోరిన్, ఇతర ప్రక్రియ ద్వారా ప్రాసెస్ చేయాల్సి ఉంటుంది. ముఖ్యంగా వైరల్ డిసీజర్, గొంతునొప్పి, డయేరియావంటి వ్యాధులు సోకే అవకాశం ఉంది.
>
> – జీవీ పున్నారావు, ప్రముఖ వైద్యుడు

పర్యావరణ పరిరక్షణ సామాజిక బాధ్యత



కొరిశపాడులో మొక్కలు నాటుతున్న ప్రజాప్రతినిధులు, అధికారులు



చీరాలలో మొక్క నాటి నీరుపోస్తున్న ఆర్డీవో సూర్యనారాయణరెడ్డి

చీరాల టౌన్: పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యతని.. ప్రతి ఏడాదికి ఒక మొక్కను నాటి పరిరక్షించాలని చీరాల ఆర్డీవో జి.సూర్యనారాయణరెడ్డి సూచించారు. వన మహోత్సవాన్ని పురస్కరించుకుని అటవీశాఖ ఆధ్వర్యంలో శుక్రవారం మండలంలోని కీర్తివారిపాలెంలో ఉన్న నగరవనంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమానికి చీరాల ఆర్డీవో, చీరాల మున్సిపల్ కమిషనర్ చక్రవర్తి, అటవీశాఖ అధికారులు, వాడరేవు జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు పాల్గొన్నారు. నగరవనంలో మొక్కలు నాటిన అనంతరం ఆర్డీవో మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణతో పాటుగా విద్యార్థి దశ నుంచే మొక్కల పెంపకాన్ని అలవాటుగా చేసుకుని ఏడాదికి ఒక మొక్కను నాటి సంరక్షించాలన్నారు. కార్యక్రమంలో సెక్షన్ ఆఫీసర్ జాన్సన్, హైస్కూల్ ఉపాధ్యాయులు శ్రీను, రామ్‌నరేష్, బీట్ ఆఫీసర్లు శిరీష, నాగమణి, రాగమ్మ, ప్రొటెక్ట్ కార్యదర్శి శవనం చంద్రారెడ్డి, వనసంరక్షణ సమితి ప్రతినిధులు పాల్గొన్నారు.



ఆదిపూడిలో మొక్కలు నాటుతున్న ఎంపీడీవో లక్ష్మీనారాయణ, విద్యార్థులు

మొక్కలే మన నేస్తాలు..

మేదరమెట్ల/అద్దంకి రూరల్/అద్దంకి: ప్రతి ఒక్కరూ కనీసం ఒక మొక్కనైనా నాటడం వలన పర్యావరణాన్ని కాపాడిన వారవుతారని ఎంపీపీ సాధినేని ప్రసన్నకుమారి అన్నారు. వనం మనం కార్యక్రమంలో భాగంగా మండల కార్యాలయంలో శుక్రవారం మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఎంపీడీవో సురేష్‌బాబు, జెడ్పీటీసీ వెంకటరమణ, కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు.

- పర్యావరణాన్ని కాపాడే మొక్కలే మననేస్తాలని అద్దంకి ఎంపీడీవో దేవసేన అన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు బాపట్ల అటవీ శాఖ అద్దంకి పట్టణాభివృద్ధి కమిటీ సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం తిమ్మాయపాలెం మండలపరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో హెచ్‌ఎం పీ గంగాధర్, చైర్మన్ గండు వెంకటరావు, అసిస్టెంట్ బీట్ ఆఫీసర్ అద్దేటి శ్రీనివాసరావు, ఫీల్డ్ అసిస్టెంట్ హరికృష్ణ, ఏ శ్రీనివాసరావు పాల్గొన్నారు.
- అద్దంకి పట్టణంలో మున్సిపల్ కమిషనర్ సత్యనారాయణ ఆధ్వర్యంలో వనమహోత్సవం నిర్వహించారు. ఈసందర్భంగా స్థానిక భవానీ సెంటర్‌లోని డివైడర్లపై కమిషనర్ మొక్కలు నాటారు.

పర్యావరణాన్ని కాపాడుదాం..

కారంచేడు/చినగంజాం: ప్రతి ఒక్కరం మన బిడ్డలకు మంచి గాలిని అందించేలా అవసరమైన చెట్లను పెంచుదామని కారంచేడు ఇన్‌చార్జ్ ఎంపీడీఓ పీ లక్ష్మీనారాయణ అన్నారు. శుక్రవారం ఆయన మండలంలోని పలు గ్రామాల్లో వనం-మనం కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. మండలంలోని ఆదిపూడి గ్రామంలో ప్రాథమిక పాఠశాల ఆవరణలో మొక్కలను నాటే కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమాల్లో తహసీల్దారు కే నరశింహారావు, ఈఓపీఆర్డీ ఆర్ రమేష్‌బాబు, ఎంఈఓలు ఎంవీ సత్యన్నారాయణ, మొలబంటి వెంకటేశ్వర్లు, ఎన్ఆర్ఈజీఎస్ సిబ్బంది, ఉపాధ్యాయులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

- పర్చూరు మండలం నాగులపాలెం గ్రామంలోని బీఆర్ అంబేడ్కర్ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో వనం-మనం కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా పాఠశాలలో కడియం నుంచి తెప్పించిన వివిధ రకాలకు చెందిన 40 మొక్కలు నాటారు. కార్యక్రమంలో జాయింట్ సెక్రటరీ ఆఫ్ రెసిడెన్సీ శివరామ్, పాఠశాల ప్రిన్సిపాల్ విశ్వరాణి, ఈఓఆర్డీ శివరామకృష్ణ, ఏపీఓ బులెయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వైభవంగా శ్రీనివాసుని కల్యాణం



అలంకరణలో స్వామి, అమ్మవార్లు

పర్చూరు (చినగంజాం): పర్చూరులోని అష్టలక్ష్మి దేవాలయంలో శ్రీనివాస కల్యాణ మహోత్సవం కన్నుల పండువగా నిర్వహించారు. బ్రహ్మశ్రీ పవన్ శర్మ ఆధ్వర్యంలో ఆగమ శాస్త్రోక్తంగా మహోత్సవాన్ని నిర్వహించారు. కల్యాణ మహోత్సవాన్ని తిలకించేందుకు భక్తులు విశేషంగా తరలి వచ్చారు. గోవిందా అంటూ స్వామిని తలచుకుంటూ ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. తిరుమల నుంచి తెచ్చిన స్వామి వారి కల్యాణ లడ్డును భక్తులకు అందజేశారు.

ఉచిత మెగా వైద్య శిబిరానికి స్పందన

చీరాల రూరల్: బాలాజీ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్, ఎన్‌జీఎస్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం వడ్డి సంఘంలో నిర్వహించిన ఉచిత మెగా వైద్యశిబిరానికి రోగుల నుంచి అనూహ్య స్పందన వచ్చింది. ఈ శిబిరంలో వివిధ ప్రాంతాల నుంచి హాజరైన 180 మంది రోగులకు వైద్యులు ఉచితంగా పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. అలానే 90 మందికి కంటి పరీక్షలు నిర్వహించగా వారిలో 36 మందికి కంటిలో శుక్లాలు ఉన్నట్లు గుర్తించారు. కంటిలో శుక్లాలు ఉన్న 36 మందికి ఉచితంగా ఆపరేషన్లు చేయటానికి ఏర్పాట్లు చేశారు. ఈమెగా వైద్య శిబిరంలో వైద్యులు డాక్టర్ బాబ్జీబాబు, డాక్టర్ సురేష్, డాక్టర్ ఎంవి. రమణారావు పాల్గొని రోగులకు వైద్య సేవలందించారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు యారం సుమన్, ఎ. విజయ్, కుసుమ, వై. భూషణం, అరుణ జ్యోతి, పవన్, చింతా శేఖర్, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

108 కమల పుష్పాలతో అమ్మవారికి పూజలు



అలంకరణలో అమ్మవారు

అద్దంకి: పట్టణంలోని శ్రీచక్ర సహిత వాసవీ కన్యకా పరమేశ్వరి దేవాలయంలో శుక్రవారం శ్రావణ మాసం నాలుగో శుక్రవారం సందర్భంగా గణపతికి, అమ్మవారికి పంచామృతాలతో, మంగళ ద్రవ్యాలతో అభిషేకం, గణపతి, నవగ్రహ, మహాలక్ష్మి, వాసవీ దేవతలకు అర్చన నిర్వహించారు. 108 కమల పుష్పాలతో అర్చన చేసి, హోమ కార్యక్రమం నిర్వహించారు. అమ్మవారిని బంగారు చీరతో అలంకరించారు. హాజరైన భక్తులకు తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు.

ఫ్రైడే డ్రైడేగా పాటించాలి

ఇంకొల్లు (చినగంజాం): ప్రతి ఒక్కరు ఫ్రైడే డ్రైడేను తప్పనిసరిగా పాటించాలని ఇంకొల్లు ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారులు డాక్టర్ అంజలి, డాక్టర్ భానుప్రకాష్‌లు సూచించారు. శుక్రవారం మండలంలోని వంకాయలపాడు గ్రామంలో నాలుగో రోజు వైద్యశిబిరం నిర్వహించారు. గ్రామంలో 16 మందికి వైద్య చికిత్స అందజేశారు. వైద్య ఆరోగ్య సిబ్బంది బృందాలుగా విడిపోయి జ్వరాల సర్వే, దోమ లార్వా సర్వేలో భాగంగా నిర్వహించిన సర్వేలో ఇరువురికి జ్వరాలు ఉన్నట్లు గుర్తించి వారికి రక్త పరీక్షలు నిర్వహించి వైద్యచికిత్స అందించారు. శుక్రవారం ఫ్రైడే డ్రైడేగా పాటించాలని ఇంట్లోని నీటి తొట్టెలో నిల్వ ఉన్న నీరును శుభ్రం చేసుకోవాలని తద్వారా దోమల లార్వా ఉత్పత్తి కాకుండా చంపవచ్చన్నారు.

అలవెన్సులు పునరుద్ధరించాలని సమావేశం



బస్టాండ్ వద్ద గేట్ మీటింగ్ నిర్వహిస్తున్న ఉద్యోగులు

చీరాల అర్బన్: ఆర్టీసీలో కండక్టర్లు, డ్రైవర్లకు నైట్ అవుట్ అలవెన్సులును పునరుద్ధరించాలంటూ నేషనల్ మజ్దూర్ యూనియన్, స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ చీరాల డిపో నాయకులు శుక్రవారం ఆర్టీసీ బస్టాండ్ వద్ద గేట్ మీటింగ్ నిర్వహించారు. కార్యక్రమానికి అధ్యక్షులు రవిబాబు అధ్యక్షత వహించగా కార్యదర్శి పి.దయాబాబు, ఎస్‌డబ్ల్యుఎఫ్ కార్యదర్శి శ్రీనివాసరాలువు మాట్లాడుతూ జీవో నెంబర్ 114లోని అలవెన్సులు అమలు చేయాలన్నారు. పీటీడీ రిటైర్డు ఉద్యోగులకు గ్రాట్యుటీ, ఆర్జిత సెలవుల బకాయిలను చెల్లించాలని డిమాండ్ చేశారు. సర్వీసులో చనిపోయిన ఉద్యోగులకు అంత్యక్రియల ఖర్చుల నిమిత్తం రూ.25 వేలు ట్రెజరీ ద్వారా ఇప్పించాలన్నారు. అర్హులైన వారికి ఎఎఎస్‌లు, ఇంక్రిమెంట్ అరియర్స్, మెడికల్ రీయింబర్స్‌మెంట్ బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేశారు. సమస్యలు తక్షణమే పరిష్కరించాలని, లేకుంటే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ప్రవీణ్, ఉద్యోగులు పాల్గొన్నారు.

వినాయక మండపాలకు అనుమతి తప్పనిసరి

అద్దంకి: వాట్సాప్‌లో ఒక్క క్లిక్‌తో వినాయక మండప అనుమతి పత్రాన్ని పొందవచ్చని సంతమాగులూరు పోలీసు శాఖ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపింది. వినాయక చవితి పందిళ్లను ఏర్పాటు చేయదలిచిన వారు వారి మొబైల్‌లో 79950 95800 నంబర్‌కు వాట్సాప్ ద్వారా హాయ్ అని మెసేజ్ చేస్తే నిరభ్యంతర పత్రం కోసం అనుసరించాల్సిన ప్రక్రియ మొత్తం మొబైల్‌కు పంపుతారన్నారు. అలా సమాచారం తెలుసుకున్న తరువాత జీఎస్ఈఎస్‌హెచ్‌యూటీఎస్‌టీవీ.ఏపీపోలీస్.జీవో వీ.ఇన్ అనే వెబ్‌సైట్ లోకి వెళ్లి గణేష్ మంటప ఏర్పాటు చేయదలచిన కమిటీ సభ్యులు వివరాలు, ఏర్పాటు చేసే ప్రదేశం, ఏ పోలీస్‌స్టేషన్ పరధిలోకి వస్తుందనే తదితర వివరాలు పొందు పరిచిన తరువాత ఆ దరఖాస్తు సంబంధిత పోలీస్ స్టేషన్‌కు పంపుతారని తెలిపారు. సంబంధిత పోలీస్‌స్టేషన్ పరిధిలోని వివిధ శాఖల బృందం మండపాన్ని ఏర్పాటు చేసే ప్రదేశాన్ని పరిశీలించి సానుకూలంగా ఉంటే చెల్లించాల్సిన రుసుం తెలియజేసిన తరువాత వెబ్‌సైట్‌లో అనుమతి లభిస్తుందని తెలిపారు. ఈ అవకాశాన్ని వినాయక మండపాలను ఏర్పాటు చేసుకునే నిర్వాహకులు అనుసరించాలని కోరారు.

కారంచేడు: వినాయక చవితిని పురస్కరించుకొని గ్రామాల్లోని వీధుల్లో ఏర్పాటు చేసే వినాయక పందిళ్లకు తప్పనిసరిగా తీసుకోవాలని కారంచేడు ఎస్ఐ వీ వెంకట్రావు తెలిపారు. శుక్రవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వినాయక విగ్రహాలు ఏర్పాటు చేసే వారికి సింగిల్ విండో క్లియరెన్స్ విధానం తీసుకువచ్చామన్నారు. దీనిని ప్రతి ఒక్క విగ్రహ కమిటీ సభ్యులు వినియోగించుకోవాలని ఆయన కోరారు.

వ్యవసాయంలో సిబ్బంది పాత్ర విలువైనది



మాట్లాడుతున్న ఏడీఏ రత్నకుమారి

మార్టూరు: వ్యవసాయంలో రైతులు పాత్ర చాలా కీలకమైనదని.. అలాంటి రైతులతో మమేకమై పని చేయాల్సిన గురుతర బాధ్యత సిబ్బందిపై ఉందని ఏడీఏ రత్నకుమారి అన్నారు. మార్టూరు, అద్దంకి పర్చూరు సబ్ డివిజన్ల పరిధిలోని రైతు సేవా కేంద్రాల సిబ్బందికి శుక్రవారం మార్టూరు వెలుగు కార్యాలయంలో నిర్వహించిన శిక్షణ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె నూతనంగా ప్రవేశపెట్టిన 'క్రాప్ లైఫ్ సిస్టం యాప్' గురించి సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. ఎంటమాలజీ సైంటిస్ట్ ఎన్. కామాక్షి వివిధ పంటలలో వచ్చే తెగుళ్లు, పురుగులు వాటి నివారణ చర్యల గురించి అవగాహన కల్పించారు. డీఆర్సీ, డీడీఏ విజయనిర్మల సిబ్బంది క్షేత్రస్థాయిలో పంటలను తెగుళ్లను పరిశీలిస్తూ వాటిని క్రాఫ్ లైఫ్ సిస్టం యాప్‌లో నమోదు చేసే విధానం గురించి అవగాహన కల్పించారు. డాక్టర్ బాల మురళీధర్ నాయక్ వరి పంటలో చేపట్టాల్సిన సస్యరక్షణ చర్యలు గురించి వివరిస్తూ సిబ్బంది తప్పనిసరిగా తమ రోజువారి విధులను టూర్ డైరీలో నమోదు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో మార్టూరు, పర్చూరు, అద్దంకి సబ్ డివిజన్ల వ్యవసాయ సహాయ సంచాలకులు కేవీ శ్రీనివాసరావు, ఎస్ మోహన్‌రావు, కే ధనరాజ్, ఏవోలు వి కిరణ్ కుమార్, ఎస్వీపీ కుమారి, డీ సుబ్బారెడ్డి, కే వెంకటకృష్ణ, శ్రీనివాసరావు, సుధీర్, వేణుగోపాలరావు, రైతు సేవా కేంద్రాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నూరుశాతం పింఛన్లు పంపిణీ చేయాలి



ఉద్యోగులకు సూచనలు చేస్తున్న ఎంపీడీవో సురేష్‌బాబు

మేదరమెట్ల: సెప్టెంబర్ పింఛను సొమ్మును శనివారం అందజేస్తామని.. అందులో భాగంగా మొదటిరోజునే నూరుశాతం పంపిణీ చేయాలని ఎంపీడీవో సురేష్‌బాబు తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో మండలంలోని పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులకు సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ తొలిరోజున పింఛను సొమ్మును తీసుకోని లబ్ధిదారులకు సెప్టెంబర్ 2వతేదీన పంపిణీ చేసేలా చర్యలు తీసుకోవవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఈవో పున్నయ్య, హౌసింగ్ ఏఈ నటరాజ్, ఈవోపీఆర్డీ ఓబులేసు పాల్గొన్నారు.

వర్షం తెచ్చిన ఆనందం..



చీరాల: చీరాల ప్రాంతంలో వర్షం ముంచెత్తింది. గురువారం అర్ధరాత్రి నుంచి చీరాలలో భారీ వర్షం కురిసింది. బలమైన గాలులుతో పాటు వర్షం కురవడంతో రోడ్లన్నీ జలమయం అయ్యాయి. శుక్రవారం సాయంత్రం వరకు కురిసిన వర్షానికి చీరాలలోని పలు ప్రాంతాలలో నీరు నిలిచింది. వర్షం కారణంగా రోడ్లపై జనజీవనం స్తంభించింది. ఈవర్షంతో నియోజకవర్గంలో పలు పంటలకు మేలు కలుగుతుందని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.